పనుల్లో నాణ్యత పాటించండి

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

- అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించాలని ఆదేశం
- రత్నానగర్‌లో రూ.44లక్షలతో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన
- స్ట్రీట్ నంబర్‌-5లో సీసీరోడ్డు వేయించాలని బస్తీవాసుల వినతి

నల్లకుంట: నియోజకవర్గంలో యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్‌లో రూ.44 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆయను కార్పొరేటర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నల్లకుంట డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలం పూర్తి చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడని.. స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. పనుల్లో జాప్యాన్ని ఏ మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. అభివృద్ధి పనులు పూర్తయ్యే వరకు పర్యవేక్షణ ఉండాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు.

వీధులు ఇలా అపరిశుభ్రంగా ఉంటే ఎలా.?

అనంతరం స్థానికంగా నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకై ఎమ్మెల్యే బస్తీలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా వీధుల్లో పేరుకుపోయిన దుర్గంధాన్ని చూసి ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. వీధులు ఇలా అపరిశుభ్రంగా ఉంటే ఎలా అంటూ శానిటేషన్ ఎస్‌ఎఫ్‌ఏపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అస్తవ్యస్త పారిశుద్ధ్యంపై కౌన్సిల్‌లో నగర మేయర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. గతంలో బస్తీలో తాగు నీటి సరఫరాలు సమస్యలు ఉండేవని ఇప్పుడు లో-ప్రెషర్ నీటి సరఫరా సమస్య.. కలుషిత నీటి సరఫరా వంటి సమస్యలు ఏమైనా తలెత్తున్నాయా అని ఎమ్మెల్యే స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు లేవని చెప్పిన స్థానికులు, ఇతర కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.



వీధుల్లో దుర్గంధంపై శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే



నల్లకుంట రత్నానగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

పాదయాత్రలో ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు..

బస్తీలోని స్ట్రీట్ నంబర్‌-5లో రోడ్డు పూర్తిగా ఛిద్రమైందని, ఆ వీధిలో నూతనంగా సీసీ రోడ్డు వేయించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. బస్తీని ఆనుకుని ప్రవహిస్తున్న హుస్సేన్‌సాగర్ నాలాకు నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ కొంత భాగం పనులు మిగిలిపోయాయని తెలిపారు. కాంట్రాక్టర్‌కు జీహెచ్‌ఎంసీ నుంచి అందాల్సిన చెక్ విడుదలలో జాప్యం కారణంగా పనులు నిలిచిపోయాయని ఆ నిధులు మంజూరు చేయించాలని కోరారు. సమస్యలన్నీ విన్న ఎమ్మెల్యే తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ పృథ్వీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, వాటర్‌వర్క్స్ ఏఈ భావన, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు గాలపల్లి శంకర్, ఎంఎస్. మూర్తి, భాస్కర్‌గౌడ్, సీహెచ్.సాయిమోహన్, రత్నానగర్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంబీ. కిషోర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి.నర్సింగ్ రావు, ఉపాధ్యక్షుడు రాముయాదవ్, సంయుక్త కార్యదర్శి టి.వీరయ్య, కోశాధికారి పి.వెంకటేష్, బస్తీవాసులు పాల్గొన్నారు.



డివిజన్ సమస్యలపై గళమెత్తిన కార్పొరేటర్

చిక్కడపల్లి: జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో గురువారం గాంధీనగర్ డివిజన్ సమస్యలపై కార్పొరేటర్ పావని గళమెత్తారు. డివిజన్‌లోని చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని సంబంధింత అధికారుల విన్నవించినా పరిష్కరించడం లేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే కొత్త బల్బులు పెట్టిన రెండోరోజే కాలిపోతున్నాయని కౌన్సిల్‌లో ప్రస్తావించారు. కొత్తగా విద్యుత్ స్తంభాలను సైతం ఏర్పాటు చేయడం లేదన్నారు. డివిజన్‌లో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉందన్నారు. డివిజన్‌లోని పార్కులను సుందరీకరించాలనే అంశాన్ని కూడా ప్రస్తావించానన్నారు. నెల రోజుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి హామీ ఇచ్చారని ఆమె వివరించారు.

నింబోలిఅడ్డలో అక్రమ నిర్మాణం కూల్చివేత



నింబోలిఅడ్డలో ఇంటి శ్లాబులను కూల్చేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

కాచిగూడ: నింబోలిఅడ్డలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్న ఓ ఇంటి శ్లాబ్‌లను జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది గురువారం కూల్చివేశారు. సదరు ఇంటి యజమాని గ్రౌండ్ ప్లస్ వన్ పర్మిషన్ తీసుకుని 4 అంతస్తుల వరకు శ్లాబులు వేసి ఇంటి నిర్మాణం చేపట్టడంతో అక్రమంగా వేసిన స్లాబులను కూల్చివేశారు. పలుమార్లు ఇంటి యజమానికి నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదని డీఎంసీ మారుతీదివాకర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ తెలిపారు. నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపట్టినా కూల్చివేస్తామని అన్నారు.

ముందే గుర్తిస్తే కేన్సర్‌కు చెక్

ముషీరాబాద్: మారిన జీవన విధానంతో 40 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళా కేన్సర్ స్క్రీనింగ్ టెస్టు చేయించుకొని కేన్సర్ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎంవీ ఆస్పత్రి ఎండీ సందీప్ తెలిపారు. గురువారం భోలక్‌పూర్‌లోని ఆస్పత్రిలో కేన్సర్‌పై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేన్సర్‌ను సకాలంలో గుర్తించి మెరుగైన చికిత్స పొందితే కేన్సర్ తగ్గుతుందన్నారు. వరల్డ్ కేన్సర్ డేను పురస్కరించుకొని ఫిబ్రవరి 8వ తేదీ వరకు తమ ఆస్పత్రిలో మహిళలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలతో పాటు 50శాతం రాయితీతో బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్ పరీక్షలను ప్రముఖ డాక్టర్ నవ్యతేజ చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సకాలంలో మందులు వాడితే కుష్టును నివారించొచ్చు



విద్యార్థులకు కుష్టుపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి

ముషీరాబాద్: కుష్టు నివారణకు సకాలంలో మందులు వాడితే నియంత్రించవచ్చని భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం కుష్టు నివారణపై పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కుష్టు ఓ బ్యాక్టీరియా వల్ల వస్తుందన్నారు. చర్మంపై మార్పులు సంభవిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 13వ తేదీ వరకు వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి జార్జ్ ఫెర్నాండేజ్ గొప్ప నాయకుడు

లిబర్టీ: విలువలతో జీవితాంతం ప్రజా సేవ చేసిన గొప్ప నాయకుడు మాజీ మంత్రి జార్జ్ ఫెర్నాండేజ్ అని లోక్ దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు పి.వి.రాజేశ్వరరావు అన్నారు. రాజకీయాల్లో నైతిక విలువలతో పనిచేసే ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన గొప్ప సోషలిస్టు నాయకుడని అన్నారు. జార్జ్ వర్ధంతి సందర్భంగా గురువారం పార్టీ కార్యాలయంలో సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జార్జ్ నిబద్ధతకు నిలువుటద్దమని, రాజకీయాల్లో విలువలను పాటించిన విలక్షణ నాయకుడని అన్నారు. కేంద్ర రక్షణ మంత్రిగా జార్జ్ పనిచేసి దేశ భద్రత కోసం అనేక చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది పి.వి.శ్రీనివాస్‌రావు, సౌభాగ్యవతి, నాగేందర్, సంకీర్త తదితరులు పాల్గొన్నారు.

రేపు రాగరాగిణి వార్షికోత్సవం

చిక్కడపల్లి: సాహితీ సాంస్కృతిక సంస్థ రాగరాగిణి వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సంస్థ అధ్యక్షుడు ఎంవీ రమణకుమారి, ప్రధాన కార్యదర్శి ఎంవీ సుబ్బలక్ష్మి తెలిపారు. గురువారం సాయంత్రం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఫిబ్రవరి 1వ తేదీన త్యాగరాయ గానసభలో సంబంధిత కార్యక్రమం సాయంత్రం 6గంటలకు ప్రారంభమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆంధ్రమహిళా సభ కళాశాల చైర్‌పర్సన్ రమాప్రభ బృందంచే త్యాగరాజ పంచరత్న కీర్తనల గానం ఉంటుందన్నారు.

రైల్లో ప్రయాణికుడి నగదు, ఫోన్ చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి నగదుతో పాటు సెల్ ఫోన్ చోరీ జరిగిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటకలోని రాయచూర్ ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ (46) కాచిగూడకు రావడానికి రాయచూర్ డెమో రైల్లో ప్రయాణిస్తున్నాడు. రైలు మహబూబ్‌నగర్ వద్దకు వచ్చిన తరువాత అతడికి మెలుకువ వచ్చింది. కాచిగూడ రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే జేబులో చూసుకోగా జేబులోని రూ.53వేల నగదు, సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు గుర్తించాడు. గురువారం కాచిగూడ రైల్వే పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించండి..
వీధులు సరిగా శుభ్రం చేయండి.!

లేకుంటే ఏ గల్లీ పరిసరాలు చూసినా ఇలాగే అధ్వానంగా కనిపిస్తాయి



తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద రోడ్డుపైనే చెత్తాచెదారం



హుస్సేన్‌సాగర్ నాలా సమీపంలోని ఆర్టీసీ బస్ టెర్మినల్ వద్ద ఫుట్‌పాత్‌పై వ్యర్థాలు

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండిపోయింది. నిత్యం క్రమం తప్పకుండా వీధులు శుభ్రం చేయాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది విధులు సక్రమంగా శుభ్రం చేయడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నల్లకుంట తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జీ పక్కన రోడ్డుపైనే చెత్తాచెదారం పేరుకుపోతోంది. అలాగే ఫీవర్ ఆసుపత్రి సమీపంలోని హుస్సేన్ సాగర్ నాలా వద్ద ఉన్న ఆర్టీసీ బస్ టెర్మినల్ వద్ద ఫుట్‌పాత్‌పై చెత్తాచెదారం పేరుకుపోయింది. దీనికి తోడు ఆ పక్కనే మూత్ర శాలలు ఉండడం వాటి నిర్వహణ గాలికి వదిలేయడంతో తీవ్ర దుర్గం వెలువడుతోంది. దీంతో బస్టాప్ వద్ద బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులు దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

'హలో బీసీ.. చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: దేశంలో త్వరలో చేపట్టబోయే జనగణనలో కుల గణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6, 7వ తేదీల్లో ఢిల్లీలో చేపట్టబోయే ధర్నాలు, ఆందోళనలు, సదస్సులకు సంబంధించిన 'హలో బీసీ.. చలో ఢిల్లీ'వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ గురువారం కాచిగూడలో మాట్లాడుతూ.. బీసీలకు జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా విభాగం ప్రధానకార్యదర్శిగా చెరుకుల సుగుణవతిని నియమించారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, సుధాకర్, రఘుపతి, అనంతయ్య, మట్ట జయంతి గౌడ్, సి.రాజేందర్, జోషి రాఘవ, ఈశ్వరప్ప, మణికంఠ, రాజు, రవి, శివమ్మ, వేణు, శివ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

చట్టపరమైన లొసుగులపై అవగాహన పెంచుకోవాలి



ఉచిత న్యాయ సలహ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డా. విష్ణుప్రియా

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: లా చదువుతున్న విద్యార్థులు న్యాయపరమైన విషయాల్లో అవగాహన పెంచుకోవాలని అంబేడ్కర్ విద్యాసంస్థల డైరెక్టర్ డా.విష్ణుప్రియా అన్నారు. గురువారం అంబేడ్కర్ లా కళాశాల విద్యార్థులకు ఉచిత న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డా.విష్ణుప్రియా మాట్లాడుతూ... పూర్వ విద్యార్థుల ద్వారా న్యాయ సలహాలను అందిస్తామన్నారు. లింగ వివక్ష, లింగ సమానత్వంపై రాజ్యాంగ పరమైన అంశాలను విద్యార్థులకు వివరించారు. చట్టపరమైన లొసుగులపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. అప్పుడే జీవితంలో ఎలాంటి సమస్యలు వచ్చినా తట్టుకోగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో లా కళాశాల, అంబేడ్కర్ స్కూల్ ప్రిన్సిపాల్, ఎస్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆంగ్లేయులతో పోరాడిన ధీశాలి కేవీ కేశవులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: దేశ స్వాతంత్ర్యం కోసం ఆంగ్లేయులతో పోరాడిన ధీశాలి కేవీ కేశవులు అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం మాజీ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత కేవీ కేశవులు వర్ధంతి సభను మేర కులవృత్తి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాడపల్లి మాధవ్ ఆధ్వర్యంలో రాంనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ కేశవులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు మంత్రివర్గంలో ఉంటూ పేదలకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ముఠా జైసింహ, నాగేష్‌ముదిరాజ్, సంఘం నాయకులు రోహిత్, కవిత, నర్సింగ్‌రావు, రాజ్‌గోపాల్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

ముషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం చెందిందని బీఆర్‌ఎస్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 420 రోజులైనా హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే తమ నిరసన వ్యక్తం చేస్తూనే ఉంటామని అన్నారు.

మాసబ్‌ట్యాంక్ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో వర్క్‌షాప్

విజయనగర్ కాలనీ: మాసబ్‌ట్యాంక్ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో ఆకట్టుకునేలా కథనాలను రూపొందించడంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో దృశ్య శ్రవ్య నిర్వహిస్తున్న క్రియేట్ ఇన్ ఇండియా చాలెంజ్ పోటీల్లో యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకే ఈ పోగ్రాంను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న రచయిత, దర్శకురాలు సరస్వతి మాట్లాడుతూ.. ప్రేక్షకులకే కాకుండా ఆయా రంగాల ప్రముఖులను కూడా ఆకట్టుకునేలా విద్యార్థులు కథలను రూపొందించాలని సూచించారు. మీడియా, వినోదరంగాలకు చెందిన అంతర్జాతీయ సదస్సు వేవ్స్‌లో భాగంగా ఫిబ్రవరిలో నిర్వహించనున్న క్రియేట్ ఇన్ ఇండియా చాలెంజ్ పోటీల్లో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ముషీరాబాద్: అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లను అందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ముషీరాబాద్ కాంగ్రెస్ నాయకుడు గుర్రం శంకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌లో ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలను అన్ని విధాల సంక్షేమ పథకాలు ఇవ్వకుండా దూరం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సర కాలంలోనే ఇచ్చిన హామీలన్నిటిని అమలు చేస్తోందని తెలిపారు. కొత్త రేషన్‌కార్డులు,ఇందిరమ్మ ఇళ్లు పేదలకు అందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, అనిల్‌కుమార్‌యాదవ్, గుర్రం దినేష్, జాన్‌శ్రీనివాస్, రాజు, శేఖర్, సత్యనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి సర్వేలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు గుర్రం శంకర్

సురేష్‌యాదవ్ మృతి బీజేపీకి తీరని లోటు

సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు

అంబర్‌పేట: బీజేపీ నేత సురేష్‌యాదవ్ మృతి పార్టీకి తీరని లోటని సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సురేష్‌యాదవ్ సంస్మరణ సభ గురువారం ఛేనంబర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా సురేష్‌యాదవ్ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుమారుడు చంద్రకాంత్‌యాదవ్ ఇతర కుటుంబసభ్యులను పరామర్శించి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్‌యాదవ్, వనం రమేశ్, చూక్క జగన్, సురేష్, రాంచందర్‌గుప్తా, మాల మహానాడు జేఏసీ నాయకులు దీపక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దివంగత బీజేపీ నేత సురేష్‌యాదవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

విశ్వకర్మ వృత్తిదారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విశ్వకర్మ వృత్తిదారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రానున్న బడ్జెట్‌లో రూ.3000 కోట్లు కేటాయించాలని తెలంగాణ సాహితీ రాష్ట్ర నాయకులు కె.ఆనందాచారి అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విశ్వకర్మ వృత్తిదారుల సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె. ఆనందాచారి మాట్లాడుతూ... విశ్వకర్మలు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకు వివిద రాజకీయ పార్టీలు తగిన అవకాశాలు ఇవ్వాలని కోరారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవీ రమణ, లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ... జనాభా ప్రాతిపదికన విశ్వకర్మలకు అన్ని రంగాలలో అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల నర్సింహచారి, కార్యదర్శి రాళ్లబండి కుమారస్వామి, ఉపాధ్యక్షులు సుంకోజు యాదగిరాచారి, భీష్మాచారి, వేముల వాడ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

ఉపకమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్

చిక్కడపల్లి: మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జవహర్‌నగర్ భవనం ప్రాంగణంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తున్న సిబ్బందిని ఉపకమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీణ సన్మానించి ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



మహాత్మా గాంధీకి నివాళి

అంబర్‌పేట: మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం అంబర్‌పేట ప్రధాన రోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఆర్.లక్ష్మన్‌యాదవ్, నారాయణస్వామి, శ్రీకాంత్‌గౌడ్, కృష్ణగౌడ్, గడ్డం శ్రీధర్, రామ్మోహన్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ.. కాంగ్రెస్ ప్రభుత్వ కళ్లు తెరిపించండి!

గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించిన ఎమ్మెల్యే

ముషీరాబాద్: అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 400 రోజులు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన 420 హామీలను నేటికీ నెరవేర్చలేదని ఎమ్మెల్యే ముఠా గోపాల్ విమర్శించారు. గురువారం అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని బాపూజీనగర్‌లోని గాంధీ విగ్రహానికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని మోసం చేశారన్నారు. ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు టెంట్‌హౌస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ముఠా జైసింహ, ఆకుల అరుణ్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, బాబురావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ సమీపంలో..

చిక్కడపల్లి: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం కెనరా బ్యాంక్ సమీపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరై గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 420 రోజులైనా హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ కళ్లు తెరిపించి ప్రజలకు పథకాలన్నీ ఇచ్చేలా చూడాలని గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు ముఠాజైసింహ, రాకేష్‌కుమార్, జి.శ్రీనివాస్, ముఠానరేష్ తదితరులు పాల్గొన్నారు.





బాపూజీనగర్, కెనరా బ్యాంక్ సమీపంలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్